సాక్షి
జనగామ

శనివారం | 12 | ఆగస్టు | 2023



చదువు చెప్పని ఉపాధ్యాయులు..

చదువు చెప్పని ఉపాధ్యాయులు మాకొద్దంటూ కాటారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. - 10లో▸



సమస్యల పరిష్కారానికి కృషి

ఏజెన్సీ ప్రాంతాల్లోని కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్ తెలిపారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
33^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో మామూలు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

యువత పాత్ర కీలకం



జనగామ రూరల్: సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని లియో క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏబీవీ డిగ్రీ కళాశాలలో లియో క్లబ్ ఆధ్వర్యంలో యువతకు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థి కళాశాల గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు, ప్రసాద్, కాసం అంజయ్య, ప్రిన్సిపాల్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యపై ఆర్టీసీ ఎండీ స్పందన



తరిగొప్పుల: మండల కేంద్రం నుంచి జనగామకు శుక్రవారం ఆర్టీసీ బస్సు ఫుట్‌బోర్డుపై విద్యార్థులు వేలాడుతూ ప్రయాణిస్తున్న వీడియోను స్థానిక యువకుడు వినేష్‌గౌడ్ ట్విట్టర్‌లో టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు పోస్ట్ చేశారు. స్పందించిన ఎండీ.. విద్యార్థులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణ చెబుతూ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని ట్విట్టర్ వేదికగా సమాధానం ఇచ్చారు.

బాలుడి ప్రాణాలు కాపాడిన యువకుడు




రక్తదానం చేస్తున్న రాజశేఖర్

జనగామ: ఆపరేషన్ సమయంలో ఓ ఐదేళ్ల బాబుకు రక్తం అత్యవసరం కావడంతో సమాచారం అందుకున్న జిల్లా కేంద్రం గుండ్లగడ్డకు చెందిన యువకుడు ఉప్పల రాజశేఖర్ ఆదుకున్నాడు. సిద్దిపేట పట్టణానికి చెందిన ఐదేళ్ల బాలుడు వైభవ్‌ని అత్యవసర చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఓపెన్ హార్ట్ సర్జరీకి సిద్ధం చేయగా.. బాబుకు రక్తం తక్కువ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆ సమయంలో బీ–ప్లస్ రక్తం అత్యవసరమని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న రాజశేఖర్ ఆస్పత్రికి వెళ్లి 27వసారి రక్తదానం చేసి బాబు ప్రాణాలు కాపాడారు. అతడిని వైద్యులు అభినందించగా, బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

14న సదరం స్లాట్ బుకింగ్


జనగామ రూరల్: జిల్లాలోని వివిధ రకాల వైకల్యం కలిగిన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ కోసం ఈనెల 14న స్లాట్ బుకింగ్ చేసుకోవాలని డీఆర్‌డీఓ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపులు నిర్వహిస్తారని, 18, 23 తేదీల్లో ఆర్థోపెడిక్, నూతన, రెన్యూవల్ సర్టిఫికెట్లకు, 25న వినికిడి లోపం ఉన్నవారికి, 29న దృష్టిలోపం ఉన్న వారికి క్యాంపు ఉంటుందని మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకుని రావాలని సూచించారు.

విధుల్లో చేరిన వీఆర్‌ఏలు



జనగామ: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేస్తూ ఆయా శాఖల్లో విలీనం చేయగా.. జిల్లాలోని 11 మంది గ్రామ రెవెన్యూ సిబ్బంది శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖ విధుల్లో చేరారు. డీఎంహెచ్‌ఓ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఐదుగురు రికార్డు అసిస్టెంట్లు, ఆరుగురు ఆఫీస్ సబార్డినేట్లకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఒకరిద్దరికి మినహా వీఆర్‌ఏలుగా గతంలో పనిచేసిన వద్దే విధులు నిర్వర్తించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

కాలిపర్స్ అందజేత



జనగామ రూరల్: జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు శుక్రవారం సంక్షేమాధికారి జయంతి చేతుల మీదుగా కాలిపర్స్, ఆర్టిఫిషియల్ లిమ్స్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రాజు పాల్గొన్నారు.

బిగుస్తున్న ఆడిట్ ఉచ్చు

బదిలీపై వెళ్లిన అధికారులకు నోటీసులు సిద్ధం

- రెగ్యులర్ అకౌంటెంట్ లేక జాప్యం
- తప్పులు బయటకు రాకుండా పైరవీలు!
- ఏకంగా రిపోర్ట్ మార్పునకు విశ్వప్రయత్నాలు..?
- ఆందోళనలకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు



జనగామ పురపాలిక కార్యాలయం

జనగామ: మున్సిపల్ ఆడిట్ వ్యవహారం బదిలీపై వెళ్లిన కొంత మంది అధికారుల మెడకు ఉచ్చులా బిగుస్తోంది. 2019–20 నుంచి 2021–22 వరకు మూడేళ్ల ఆడిట్ ఇటీవల పూర్తయిన విషయం తెలిసిందే. ఆడిట్‌ను అటకెక్కించి.. మూడేళ్ల పాటు విచ్చలవిడిగా ఖర్చుచేసిన ప్రజాధనానికి లెక్కలు లేకుండా చేసిన అధికారులు.. నేడు విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆడిట్‌లో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగులోకి వచ్చాయనే సమాచారం నేపథ్యంలో ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు బయటకు రావాల్సి ఉంది. ఆడిట్‌లో వెలుగు చూసిన తప్పులను కప్పిపుచ్చడానికి సదరు అధికారులు హైదరాబాద్ స్థాయిలో పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

రిపోర్ట్ మార్పునకు వ్యూహాలు..!

జనగామ మున్సిపల్ అకౌంటెంట్ ఇటీవల మెటర్నిటీ సెలవుపై వెళ్లారు. కొత్త వారికి పోస్టింగ్ ఇచ్చినప్పటికీ ఇక్కడకు వచ్చేందుకు విముఖత చూపిస్తున్నారు. వారానికి రెండు రోజులైనా పని చేయాలని సూచించినా.. ఓ అకౌంటెంట్ ససేమిరా అంటున్నట్లు సమాచారం. దీంతో ఆడిట్‌లో తేలిన తప్పులపై వివరణ కోరేందుకు బదిలీపై వెళ్లిన అధికారులకు నోటీసుల జారీ చేయడంలో ఆలస్యం జరుగుతోంది. పలువురు కమిషనర్లతో పాటు ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ డీఈ, అకౌంటెంట్‌లకు నోటీసులు జారీ చేయాల్సి ఉంది. కేటగిరీల వారీగా ప్రస్తుత అధికారులు నోటీసులు తయారు చేసి సిద్ధంగా ఉంచినప్పటికీ అకౌంటెంట్ లేకపోవడం జాప్యానికి కారణమవుతోంది. దీంతో సదరు అధికారులు ఆడిట్ రిపోర్టు బయటకు రాకుండా విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అవసరమైతే ఆడిట్‌ను సైతం మార్పించేందుకు వ్యూహాలు పన్నుతున్నట్లు చర్చ జరుగుతోంది. ఇందుకోసం ఇటీవల బదిలీపై వెళ్లిన పెద్దమనిషి 'మ్యానేజ్' చేసే బాధ్యతలను భుజాన వేసుకున్నట్టు తెలుస్తున్నది. 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు స్పెషల్ గ్రాంట్స్ కాకుండా.. సుమారు రూ.10.81 కోట్లకు ఆడిట్ జరిగింది. ఇందులో కొన్ని ఎంబీలపై కమిషనర్, డీఈ సంతకాలే లేక పోవడం, వర్కు ఆర్డర్లలో తప్పులు, తీర్మానం కంటే ఎక్సెస్ పేమెంట్లు.. ఇలా అనేక తప్పిదాలు ఉన్నట్లు ఆడిట్ బృందం నివేదికలో పేర్కొంది. కోట్లలో ప్రజాధనం పక్కదారి పట్టిఉండవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ శివలింగయ్య ప్రత్యేక చొరవ తీసుకుని ఆడిట్‌పై మరో మారు విచారణ చేపట్టి బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే మున్సిపల్ అవినీతి భాగోతంపై ప్రత్యక్ష పోరాటాలు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ రజితను అడగ్గా.. ఆడిట్ రిపోర్టుకు సంబంధించి బదిలీపై వెళ్లిన అధికారుల నుంచి వివరణ కోరేందుకు ఇంకా నోటీసులు పంపించలేదన్నారు. అకౌంటెంట్ మెటర్నిటీ సెలవుపై వెళ్లడం, కొత్తగా ఎవరూ రాకపోవడం జాప్యానికి కారణమని చెప్పుకొచ్చారు.

పేదల పెళ్లికి పెద్దన్న కేసీఆర్

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వివాహానికి చెక్కు అందజేస్తున్న మంత్రి

పాలకుర్తి: రాష్ట్రంలోని పేదల పెళ్లికి పెద్దన్న సీఎం కేసీఆర్ అని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి మండలంలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి కుటుంబంలో ఆడ బిడ్డ పెళ్లికి మేన మామగా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా కానుక అందజేస్తున్నది ఒక్క కేసీఆర్ ప్రభుత్వమే అని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రాంమూర్తి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.మదార్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, అయిలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు, సర్పంచ్ యాకాంతరావు, సహకార సంఘం చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదం.. దేశానికి ప్రమాదకరం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న కనకారెడ్డి

జనగామ రూరల్: మతోన్మాదం దేశానికి ప్రమాదకరం.. అన్ని జాతుల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఏకరూప పౌరస్మృతిని ముందుకు తీసుకువస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైన బీజేపీ సర్కారు వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి మతాలు, జాతుల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ మణిపూర్ హింసకు కారణమైందని అన్నారు. ఉమ్మడి పౌరస్మృతి, 21వ కమిషన్ సిఫార్సులపై పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాంబరాజు యాదగిరి, బుర్రి ప్రసాద్, ఎండీ అబ్బాస్, రాపర్తి రాజు, రమేష్, అహల్య, ఉపేందర్, సోమన్న, యాకయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలి

- సీజేఐటీ డైరెక్టర్ ఫాదర్ విజయపాల్‌రెడ్డి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి

జనగామ: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ.. తల్లిదండ్రులు, గురువుల నమ్మకాన్ని నిలబెట్టాలని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ డి.విజయపాల్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫస్టియర్ డిప్లొమా విద్యార్థులు, వారి తల్లితండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుతూ తల్లితండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానాన్ని దేశాభివృధికి ఉపయోగించాలని అన్నారు. మారుతున్న సమాజానికి తగ్గట్టుగా విద్యార్థులు విషయ అవగాహన, బోధన పద్ధతులు, సాంకేతికతలో అప్‌డేట్ కావాలని సూచించారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

- మెరిట్ ఆధారంగా కేజీబీవీలు, యూఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక
- డీఈఓ వెబ్‌సైట్‌లో జాబితా
- నేడు అభ్యంతరాల స్వీకరణ



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న గౌసియా, అధికారులు

జనగామ రూరల్: కేజీబీవీలు, యూఆర్ఎస్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారం చేపట్టారు. కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులకు గత నెల ఆన్‌లైన్‌లో అప్లికేషన్లు స్వీకరించిన అనంతరం పరీక్ష నిర్వహించగా.. ప్రభుత్వం గురువారం ఫలితాలు వెల్లడించింది. జిల్లా వ్యాప్తంగా 42 పోస్టులకు 126 మంది అర్హత సాధించగా.. 1:3 ప్రకారం అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్టెన్ పాఠశాలలో అధికారులు సర్టిఫికెట్లను పరిశీలించారు. సీఆర్టీ, పీజీ సీఆర్టీ, ఎస్‌ఓ పోస్టులకు అభ్యర్థులు హాజరు కాగా.. దూర ప్రాంతంలో ఉన్నవారు హడావుడిగా వచ్చి ఇబ్బంది పడ్డారు. అలాగే ఇదే రోజు గురుకులం తదితర పరీక్షలు ఉండడంతో కొంత ఆలస్యంగానైన వెరిఫికేషన్ పూర్తి చేశారు. మెరిట్ జాబితాను www.deojangaon.com వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించి ఆదివారం పోస్టింగ్‌లు ఇస్తామని, అదేరోజు జాయిన్ కావాలని డీఈఓ రాము, ఇన్‌చార్జ్ గౌసియా తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న జడ్జిలు

జనగామ: క్రీడలు ఒత్తిడిని తగ్గించి మానసికోల్లాసాన్ని ఇస్తాయని జిల్లా జడ్జి డి.రవీంద్రశర్మ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగామ కోర్టులో శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెల్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలను ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి నర్మదతో కలిసి రవీంద్రశర్మ ప్రారంభించారు. న్యాయవాదులు హరిశ్చంద్రప్రసాద్, జాన్‌రెడ్డి, శ్రీరాం శ్రీనివాస్, స్టీవెన్, మనోహర్, రాంమోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మణస్వామి, పానుగంటి శ్రీనివాస్, హరిప్రసాద్ యాదవ్, కందుల సతయ్య, గాజుల రవీందర్, ఎల్లారెడ్డి, తీగల నర్సిరెడ్డి, బండి మధుసూదన్, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సత్కారం

జనగామ నియోజకవర్గం, ప్రస్తుత సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరుకు పోరాడిన జనగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి, చేర్యాల ప్రాంత న్యాయవాదులు జేఏసీ కన్వీనర్ భూమిగారి మనోహర్‌ను సత్కరించారు. శుక్రవారం కోర్టు ఆవరణలోని బార్ చాంబర్‌లో కార్యక్రమం జరిగింది.

వంద దాటిన వైన్స్ టెండర్లు

జనగామ: నర్మెట మినహా.. 11 మండలాల పరిధిలో శుక్రవారం నాటికి మద్యం దుకాణాల టెండర్లు వంద దాటాయి. గడువు దగ్గర పడుతుండడంతో ఒక్కరోజే 47 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు అత్యధికంగా జనగామ 48, అత్యల్పంగా దేవరుప్పుల ఒకటి వచ్చినట్లు జనగామ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రవీణ్ తెలిపారు. మండలాల వారీగా దరఖాస్తులు ఇలా.. లింగాలఘణపురం, కొండకండ్ల రెండు చొప్పున, స్టేషన్‌ఘన్‌పూర్, తరిగొప్పుల, జఫర్‌గఢ్ ఐదు చొప్పున, బచ్చన్నపేట, చిల్పూరు ఎనిమిది చొప్పున, పాలకుర్తి ఆరు, రఘునాథపల్లికి 10 వచ్చాయి.

పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య



ఓటుహక్కు ట్రయల్‌రన్‌లో పాల్గొన్న అధికారులు

- ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహణ
- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

జనగామ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 15న వేడుకలు వైభవంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో చేపట్టే ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, సుహాసిని, డీసీపీ సీతారాం, సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శాఖల వారీగా ప్రగతి నివేదిక ప్రసంగం కాపీలు సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ, మిషన్ భగీరథ, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ, మత్స్య, మున్సిపల్, గృహనిర్మాణ, చేనేత, టూరిజం, దేవాదాయ, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక తదితర 25 విభాగాలకు చెందిన స్టాల్స్, ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన 1.65 లక్షల జాతీయ జెండాలను జీపీలకు అందజేసిన కలెక్టర్.. ప్రతీ ఇంటికి జాతీయ జెండా పంపిణీ చేయాలని, వాటిని ఎలా ఎగురవేయాలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు రామ్మూర్తి, మురళీకృష్ణ, డీఆర్డీఓ రాంరెడ్డి, జెడ్పీ సీఈఓ వసంత, సీపీఓ ఇస్మాయిల్, డీఏఓ వినోద్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ రవీందర్ పాల్గొన్నారు.

మద్యం టెండర్ల ప్రక్రియ పరిశీలన

వడ్లకొండ ఇరిగేషన్ క్వార్టర్స్‌లోని జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో కొనసాగుతున్న మద్యం టెండర్ల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 47 మద్యం దుకాణాలకు గాను ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 21న వైన్స్ షాపుల కేటాయింపునకు లాటరీ నిర్వహిస్తామని చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ చివరి రోజు టెండర్ వేయడానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన

కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అన్ని శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ యంత్రాలపై ఓటింగ్ చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. ట్రయల్ రన్‌లో ఈవీఎంలపై ఓటు హక్కును వినియోగించుకున్నారు.

'హర్ ఘర్ తిరంగా'..

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ ఆదేశాల మేరకు తపాలా శాఖ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా 2.0' కార్యక్రమం చేపట్టినట్లు జనగామ పోస్టల్ సబ్ డివిజన్ సహాయ పర్యవేక్షకులు మూల రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జాతీయ జెండా అందజేశారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, భిక్షపతి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, సుహాసిని, డీసీపీ సీతారాం, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, శ్రీనివాసరావు రఘుచందర్, ఏఈఆర్‌ఓలు, సెక్టోరియల్ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. సెక్టోరియల్, బూత్ లెవల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఓటరు నమోదు, స్లిప్ యాక్టివిటీ చురుకుగా కొనసాగుతోందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఈ మేరకు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల నియమావళి అనుసరించి ప్రతి విభాగానికి నోడల్ అధికారులను నియమించినట్లు ఈ సందర్భంగా వివరించారు.

ఆర్టీసీ అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి

- కరీంనగర్ జోన్ ఈడీ వినోద్‌కుమార్



అభినందన సభలో పాల్గొన్న వినోద్‌కుమార్, తదితరులు

జనగామ రూరల్: ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులంతా సమష్టి కృషి చేయాలని కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం జనగామ డిపోను సందర్శించిన అనంతరం ఏర్పాటు చేసిన ఉద్యోగుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్లు, డ్రైవర్లకు, అలాగే టీం డ్రైవర్లకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ రీజియన్ మేనేజర్ జె.శ్రీలత, డిప్యూటీ రీజనల్ మేనేజర్ కె.భానుకిరణ్, డిపో మేనేజర్ వి.జ్యోత్స్న, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

సోమేశ్వరుడి హుండీ ఆదాయం రూ.17 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పాలకుర్తి టౌన్: శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.17,21,328 వచ్చినట్లు ఈఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. ఈ ఏడాది మార్చి 16 నుంచి ఆగస్టు 11 వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు, 150 రోజుల ఆదాయాన్ని శుక్రవారం ఆలయ కల్యాణ మండపంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ భువనగిరి ఇన్‌స్పెక్టర్ బి.సుమతి పర్యవేక్షణలో లెక్కించారు. అమెరికా కరెన్సీ 26(291), సింగపూర్ కరెన్సీ 1(2డాలర్లు) వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. లెక్కింపులో ధర్మకర్తలు కె.నర్సింహారెడ్డి, ధరావత్ యాకూబ్‌నాయక్, చిదిరాల సంధ్యారాణి ధనుంజయ, సిబ్బంది, మహబూబాబాద్‌కు చెందిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

చండిక అమ్మవారికి పంచామృతాభిషేకం

స్వయంభు శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ చండికాదేవికి శ్రీసూక్త విదానేన పంచామృత అభిషేకం, పట్టు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష అలంకరణ, శ్రీలలితా సహస్రనామ పారాయణం, నీరాజన మంత్ర పుష్పములు తీర్థ ప్రసాద వితరణ వైభవంగా నిర్వహించారు.

ఇమాం.. మౌజాన్ల నియామకం

- జిల్లాలో కొత్తగా 60 మందికి అవకాశం
- నెలకు రూ.5వేల గౌరవ వేతనం
- ఇప్పటికే సేవలందిస్తున్న 130 మంది



స్వీట్లు పంపిణీ చేస్తున్న ముస్లింలు

జనగామ: మసీదుల్లో ఇమాం, మౌజాన్ల నియామకానికి తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కొంత కాలంగా సర్కారు ఆదేశాల కోసం ఎదురుచూస్తున్న ముస్లిం మైనార్టీలకు సీఎం కేసీఆర్ శుభవార్త అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా గౌరవ వేతనంతో కూడిన 7వేల మంది ఇమాం, మౌజాన్లను నియమిస్తుండగా.. జిల్లాలో 60 మందికి అవకాశం రానుంది. వక్ఫ్‌బోర్డు పర్యవేక్షణలో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

జిల్లాలోని 12 మండలాల పరిధిలో ప్రస్తుతం ఇమాం, మౌజాన్లు 130 పని చేస్తుండగా.. కొత్తగా 60 మంది అవకాశం ఇవ్వనుండడంతో సంఖ్య 190కి చేరుకోనుంది. ప్రభుత్వం వీరికి ప్రతినెలా రూ.5వేల గౌరవ వేతనం చెల్లిస్తుంది. ఇమాంలు మసీదుల్లో ప్రార్థనల నిర్వహణ, మౌజాన్లు అల్లాహ్ సేవలో పని చేయాల్సి ఉంటుంది. మసీదు కమిటీ ఆదేశాల మేరకు మత పెద్దలు చర్చించుకున్న తర్వాత దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక బాధ్యత వక్ఫ్‌బోర్డుపై ఉంటుంది.

పట్టణంలో సంబురాలు

ప్రభుత్వం కొత్తగా ఇమాం, మౌజాన్లకు అవకాశం ఇవ్వడంతో జనగామ పట్టణంలో ముస్లిం మైనార్టీ నాయకులు సంబురాలు జరుపుకుని, స్వీట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మసిఉర్ రెహమాన్, సలీం, అన్వర్ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



మసీదుల్లో ప్రార్థనలు, సేవల కోసం జిల్లాలో కొత్తగా 60 మందికి అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ముస్లింల తరఫున కృతజ్ఞతలు. వీరి నియామకం విషయమై గ్రామాల్లోని ముస్లిం కమిటీలు చర్చించుకోవాలి. ఇందులో మార్పులు, చేర్పులు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈ విషయమై మరింత సమాచారం కోసం వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్ (7995560142)ను సంప్రదించాలి.

\- ఎండీ.సలీం, బీఆర్ఎస్ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు

గుణాత్మక విద్యతోనే సామాజిక అభివృద్ధి: వీసీ



మాట్లాడుతున్న కేయూ వీసీ రమేశ్

కేయూ క్యాంపస్: విద్య లేకుండా సమాజం వికసించదని, గుణాత్మక విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం అని కేయూ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. శుక్రవారం కేయూలో విద్యావిభాగం, ఎన్‌సీపీసెల్, పీవీ నర్సింహారావు విజ్ఞాన పీఠం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏ టాక్ ఇన్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–20 కాంటెక్స్ట్ ఆఫ్ ఫెడరల్ స్పిరిట్' అంశంపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ రమేశ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో తాత్విక హేతుబద్ధ దృక్పథం ఉండాలని, విద్య అందరికీ అందించాల్సిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీ ఎన్‌సీటీఈ సదరన్ రీజియన్ కౌన్సిల్ సభ్యులు ఘంటా రమేశ్ మాట్లాడుతూ.. జాతీయ నూతన విద్యావిధానం అమలులో రాష్ట్రం బాధ్యత చాలా ఉందన్నారు. విద్యా బోధన సైంటిఫిక్‌గా ఉండాలన్నారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు, కేయూ ఎన్ఈపీ సెల్ డైరెక్టర్ కృష్ణమాచార్య, విద్యా విభాగం డీన్ అడ్జెంట్ ఆచార్యులు ఎన్.రాంనాథ్‌కిషన్, విద్యా కళాశాల ప్రిన్సిపాల్ రణధీర్‌రెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ పి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సవాల్‌గా 'కత్తిపోటు' కేసు..!

- బాధితుడి కడుపు భాగంలో మూడు కుట్లు వేసిన ఎంజీఎం వైద్యులు
- నిందితులు శ్రీనివాస్, రంజిత్‌లే చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు
- ఆ సమయంలో హైదరాబాద్‌లో ఉన్నామంటున్న నిందితులు
- మిల్స్‌కాలనీ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తేనే కథ క్లైమాక్స్‌కు

సాక్షి, వరంగల్: వరంగల్ నగరంలోని మిల్స్‌కాలనీ ఠాణా పరిధిలో ఇటీవల సంచలనం సృష్టించిన కత్తిపోటు కేసు విచారణ పోలీసులకు సవాల్‌గా మారింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ఈ సమయంలో వరంగల్ నగరం నడిబొడ్డున ఈనెల 5వ తేదీ రాత్రి గణేశ్‌నగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన వారం రోజులు కావొస్తున్నా.. పోలీసులు ఏం తేల్చలేకపోతున్నారు. ఎం.శ్రీనివాస్, అతడి బావమర్ది కె.రంజిత్‌కు బ్యాంకులో ఇప్పించిన దాదాపు రూ.కోటిన్నర రుణం కింద ఇవ్వాల్సిన కమీషన్ అడిగినందుకే తనపై దాడి చేశారని చారుగండ్ల శ్రీనివాస్ మిల్స్‌కాలనీ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి జరిగిన రోజు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి.. అక్కడి నుంచి రక్తపు మరకలతో ఎంజీఎం ఆస్పత్రికి వెళ్తే వైద్యులు చికిత్స అందించారు. దాదాపు కడుపుపై మూడు కుట్లు వేసి మరుసటి రోజు డిశ్చార్జ్ చేశారు.

అనుమానాలెన్నో.. పోలీసులు తేల్చాల్సిందే..

- నిందితుడు ఎం.శ్రీనివాస్ అదే రోజు రాత్రి వరకు హైదరాబాద్‌లో ఉన్నట్టుగా చెప్పడంతో అక్కడి సీసీటీవీ ఫుటేజీలను తెప్పిస్తున్నట్టుగా తెలిసింది.
- బాధితుడు సి.శ్రీనివాస్ మాత్రం తనపై దాడి చేసింది ఎం.శ్రీనివాస్, కె.రంజిత్ అని ఖరాఖండిగా పోలీసులకు చెబుతున్నాడు. దాడి జరిగిన ప్రాంతానికి కొద్ది మీటర్ల దూరంలో నిందితుడు ఎం.శ్రీనివాస్ ఇంటి వద్ద సీసీ టీవీ కెమెరాలు కూడా ఉన్నాయి. అయితే ఆ సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు బాధితుడు శ్రీనివాస్ అతడి ఇంటి ముందుకు వచ్చి బండిపైనే ఉండి పిలిచినట్టుగా ఉన్న దృశ్యాలు రికార్డు అయ్యాయి.
- బాధితుడు ఆరోపిస్తున్నట్టుగా తనపై దాడి చేసిన సమయంలో అటువైపుగా కారు వెళ్లడం వల్ల బండి స్లో చేశానని, ఇద్దరు వ్యక్తులు వచ్చి దాడి చేస్తుండడంతో బండి పట్టుకొని ముందుకొచ్చానని చెప్పాడు.
- బాధితుడు చెప్పినట్టుగా ఆ సమయంలో అటువైపుగా వెళ్లిన కారు దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీకి చిక్కాలి. అటువంటిదేమీ కనిపించలేదని పోలీసులు చెబుతున్నారు. అంటే ఇతడిపై దాడి జరిగి పరారైన వెంటనే ఆ కారు వెనక్కి తీసుకొని వెళ్లారా? వెళ్తే మెయిన్‌రోడ్డుపై ఉన్న సీసీటీవీ కెమెరాల్లో ఆ దృశ్యం చిక్కి ఉంటుంది కదా.. ఆ దిశగా విచారణ చేయాల్సిన అవసరం ఉంది.
- బాధితుడే కత్తితో దాడి చేసుకొని ఇలా చేశాడన్న ప్రచారం జరిగినా.. అందులో వాస్తవం ఎంత అన్నది పోలీసులు తేల్చాలి. బాధితుడు మాత్రం తనను తాను పొడుచుకునేంత ఖర్మ పట్టలేదని, కమీషన్ ఇవ్వాలని కొన్నిరోజులుగా వారి చుట్టూ తిరుగుతున్నానని, దాని కోసం ప్రాణం తీసుకునే నాటకాలు ఆడాల్సిన అవసరం లేదని చెబుతున్నాడు. అవసరమైతే తనను మోసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేస్తానే తప్ప ప్రాణాలు తీసుకోవాల్సిన అవసరం లేదంటున్నాడు.
- దీంతో అసలు ఏం జరిగిందనే దిశగా పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేసి అసలు నిందితులెవరో తేల్చాల్సిన అవసరం కనిపిస్తోంది. అవసరమైతే ఆ దాడి చేసిన సమయంలో ఫిర్యాదుదారుడు శ్రీనివాస్‌తో పాటు ఇంకా ఎవరి మొబైల్ నంబర్‌లు ఆ ప్రాంతంలో పనిచేశాయి అనే దిశగా కూడా విచారించాల్సిన అవసరం ఉంది.



గణేష్‌నగర్ కాలనీలో బాధితుడిపై దాడి జరిగిన ప్రదేశం ఇదే..



చికిత్స పొందుతున్న బాధితుడు (ఫైల్)

సందర్శకులకు అల్పాహారం



హనుమకొండలో అల్పాహారం వడ్డిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హన్మకొండ: తన వద్దకు వివిధ పనుల కోసం వచ్చే సందర్శకుల సౌకర్యార్థం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. హనుమకొండలోని క్యాంపు కార్యాలయం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని మంత్రి దయాకర్‌రావు ప్రారంభించి, స్వయంగా వడ్డించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను అందుబాటులో ఉండే హైదరాబాద్ మంత్రుల నివాసం, హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, పాలకుర్తి క్యాంపు కార్యాలయం, పర్వతగిరిలోని తమ ఇంటి వద్ద ఈ సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్



మాట్లాడుతున్న కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్

ములుగు రూరల్: ఏజెన్సీ ప్రాంతాల్లోని కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ అన్నారు. ఈమేరకు శుక్రవారం కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 'అమరుల యాదిలో' సామాజిక చైతన్య సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గట్టమ్మ ఆలయం నుంచి జిల్లా కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో కల్లుగీత కార్మికులు పాలకుల కుట్రలకు బలయ్యారన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది కల్లుగీత కార్మికులు వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. కల్లు గీత వృత్తి ఆధునీకీకరణ కార్యాచరణ రూపొందించి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటుగా ఉంటామన్నారు. కల్లు గీత వృత్తిలో ఆధునికీకరణ లేక ప్రమాదాల బారిన పడుతున్నారని, నివారణ చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రూ.12 కోట్లతో నీరా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. మద్యం దుకాణాల్లో కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం 15 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. కుల వృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. ప్రమాదాల బారిన పడిన గీత కార్మికులకు గీత బీమా పథకంలో భాగంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బొనగాని యాదగిరిగౌడ్, జిల్లా అధ్యక్షుడు మొండయ్య, ప్రసాద్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సయ్య గౌడ్, రవిగౌడ్, మానస, శ్రీనివాస్, సదయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తా

కాజీపేట రూరల్: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–23 పోటీల్లో కాజీపేట సబ్ డివిజన్‌కు చెందిన రైల్వే ట్రాక్ ఉమెన్ (కరీంనగర్) చుంచు మమత, కాజీపేట 47వ డివిజన్ రాంనగర్‌కు చెందిన నేషనల్ ఐరన్ జిమ్ సెంటర్ ఓనర్ ఎండీ.జాఫర్ పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. సీనియర్ కేటగిరీలో మమత 57 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రెండు గోల్డ్‌మెడల్స్ సాధించారు. అదేవిధంగా జాఫర్ 57 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారు. వీరిద్దరూ త్వరలో జరిగే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు చెన్నైకి చెందిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ జనరల్ సెక్రటరీ ఎం.రమేశ్, టీఎస్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ చేతుల మీదుగా జాఫర్ గోల్డ్‌మెడల్, ప్రశంస పత్రం అందుకున్నారు. డాక్టర్ సురేఖ ఓంప్రకాశ్ చేతుల మీదుగా మమత రెండు గోల్డ్‌మెడల్స్, ప్రశంసపత్రం అందుకున్నారు.



జాఫర్, మమతను అభినందిస్తున్న పవర్‌లిఫ్టింగ్ చైర్మన్

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూ తేదీలు ఖరారు

కేయూ క్యాంపస్: కేయూలో ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్ ఫార్మసీ విద్యా విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూల తేదీలను వర్సిటీ అధికారులు ఖరారు చేశారు. గత నెల మూడో వారంలో నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వర్షాల కారణంగా వాయిదా వేశారు. ఇటీవల అన్ని విభాగాల డీన్‌లతో వీసీ రమేశ్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు సమావేశమై తేదీలను ఖరారు చేశారు. సోషల్ సైన్స్‌లోని వివిధ విభాగాల్లో ప్రవేశాలకు ఈనెల 17 నుంచి 20 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఈనెల 17, 18 తేదీల్లో, సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఈనెల 21 నుంచి 26 వరకు, ఆర్ట్స్ తెలుగు విభాగంలో ఈనెల 22, 23 తేదీల్లో, ఇంగ్లిష్ విభాగంలో 25, 26 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. విద్యా విభాగంలో భాగంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు ఈనెల 24న, ఫార్మసీ విభాగంలో 27, 28 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆయా డీన్‌లు బన్న అయిలయ్య, టి.మనోహర్, పి.మల్లారెడ్డి, పి.అమరవేణి, వై.నర్సింహారెడ్డి, ఎస్.రాంనాథ్ కిషన్‌లు తమ విభాగాల్లో ప్రవేశాలకు సంబంధిత అభ్యర్థులకు ఇంటర్వ్యూల కాల్ లెటర్లు పంపిస్తున్నారు. అభ్యర్థులకు వాట్సాప్ ద్వారా ఇంటర్వ్యూల తేదీలను సమాచారం అందించనున్నట్లు సమాచారం. మెరిట్‌కమ్ రిజర్వేషన్ పద్ధతిలో నిబంధనల ప్రకారమే పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పించాలని వీసీ ఇదివరకే తాటికొండ రమేశ్ డీన్‌లను ఆదేశించారు. నోటిఫికేషన్ సందర్భంగా ఎన్ని సీట్లు వెకెన్సీలుగా విభాగాల వారీగా చూపారో.. ఆయా సీట్లలోనే భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు తమ రీసెర్చ్ ప్రపోజల్స్‌తో పాటు హాజరు కావాల్సి ఉంటుంది.

చదువు చెప్పని ఉపాధ్యాయులు మాకొద్దు

- రోడ్డెక్కిన సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థులు
- కాటారం మండలం దామెరకుంటలో ఆందోళన



రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కాటారం: 'పాఠశాలలో ఉపాధ్యాయులు చదువు చక్కగా చెప్పడం లేదు. ఈవిషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. చదువు చెప్పని ఉపాధ్యాయులు మాకొద్దు' అని కాటారం మండలం దామెరకుంట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కారు. పాఠశాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు దామెరకుంట–గంగారం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులు సరిగ్గా బోధించడం లేదని ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. పాఠశాల, కళాశాలలో మూత్రో జులుగా నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నామని, మరుగుదొడ్లు సరిపడా లేవని, ప్రహరీ చిన్నగా ఉండడంతో ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించట్లేదని, విజిటింగ్ కోసం వచ్చిన తల్లిదండ్రులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కించపర్చేలా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు గంటలు ఆందోళన కొనసాగింది. వారికి ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు యువకులు మద్దతు తెలిపారు. సమాచారం అందుకున్న ట్రైనీ ఎస్సై ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి విద్యార్థులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ఆర్‌సీఓ విచారణ..

విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్‌సీఓ విద్యారాణి పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ మైథిలీతో, విద్యార్థులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. సమస్యలు పరిష్కరిస్తామని ఆర్‌సీఓ హామీ ఇచ్చారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు.



రామకృష్ణారెడ్డి మృతదేహం

ములుగు రూరల్: అప్పుల బాధతో ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామానికి చెందిన ఎర్రం రామకృష్ణారెడ్డి(43) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు తనకున్న రెండెకరాల భూమితో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి పూర్తిగా పాడైంది. దీంతో పంట సాగుకు చేసిన రూ.3.5 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. చేను వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న రామకృష్ణారెడ్డిని స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడి తండ్రి నర్సిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు. కాగా.. బాధిత కుటుంబాన్ని ములుగు ఎమ్మెల్యే సీతక్క, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ అమ్జద్‌పాషా పరామర్శించారు. విషయం తెలుసుకున్న పంట నష్టంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడన్న విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు పంటను పరిశీలించారు. వరదల కారణంగా రైతు రామకృష్ణారెడ్డికి చెందిన పత్తి పూర్తిగా నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి సంతోశ్ తెలిపారు.

పంట నష్టంతో మనస్తాపం చెంది రైతు



గట్టు రాజయ్య(ఫైల్)

టేకుమట్ల(రేగొండ): అప్పుల బాధతో రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన రైతు గట్టు రాజయ్య(55) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాజయ్య తనకున్న ఎకరం భూమితో పాటు, మరో ఎకరంన్నర భూమిని కౌలుకు తీసుకున్నాడు. గతేడాది మిర్చి పంటకు తెగులు సోకి పంట పూర్తిగా నష్టపోయింది. సుమారు రూ.5 లక్షల మేర అప్పు అయ్యింది. ప్రస్తుతం పత్తి సాగు చేయగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఉన్న పత్తి మొక్కలకు నీరు పారించేందుకు వ్యవసాయ బావివద్దకు వెళ్లి మోటారు ఆన్ చేయగా.. మోటారు కాలిపోయింది. దిక్కుతోచని స్థితిలో రైతు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

బావిలో దూకి ఒకరు..



రాజు(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: కుటుంబ కలహాలతో మహబూబాబాద్ మండలం సోమ్లు తండాకు చెందిన తేజావత్ రాజు(38) శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా రాజు కుటుంబంలో కలహాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్నెళ్ల క్రితం రాజు భార్య రాజేశ్వరి పుట్టింటికి వెళ్లింది. రాజు మాత్రం తండాలోనే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని నల్లాల బావిలో ఒక మృతదేహం కనిపిస్తోందని, దుర్వాసన వస్తోందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి తేజావత్ రాజుగా గుర్తించారు. మృతుడి అన్న కోబల్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఎస్సై బి.రాంచరణ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వీఆర్‌ఏ ..



సమ్మయ్య (ఫైల్)

మొగుళ్లపల్లి: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన చెక్క సమ్మయ్య(70) వీఆర్‌ఏ ఆత్మహత్య చేసుకున్నాడు. సమ్మయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు చనిపోగా.. పెద్ద కొడుకుకు ఒక కుమారుడున్నాడు. ఇటీవల ప్రభుత్వం 60 ఏళ్లు దాటిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగం అందించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో సమ్మయ్య తాను ఉద్యోగం చేయనని, చిన్న కుమారుడు, పెద్ద కుమారుడి కొడుకు(మనవడు) ఇరు కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడాడు. ఇరువురి మధ్య బేధాభిప్రాయాలు రాగా.. ఉద్యోగం వృథాగా పోతుందని మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. చికిత్స కోసం చిట్యాల ఆస్పత్రికి తీసుకురాగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు.. మృతుడి భార్య రాయమల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

సీఎం కేసీఆర్‌ను ఇంటికి పంపాలి



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వేదికపై మాజీ ఎంపీ బలరాంనాయక్, బెల్లయ్య నాయక్ తదితరులు

- టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: మాటలతో మోసం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ప్రజలు ఇంటికి పంపించాలని టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం శుక్రవారం జిల్లా కేంద్రంలో అంగరంగ వైభవంగా జరిగింది. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి, అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నందన గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న మానుకోట ప్రాంతం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఎన్నికలు దగ్గరపడ్డాయని కేసీఆర్ రుణమాఫీ అంటూ ముందుకొస్తున్నారని విమర్శించారు. నాలుగు నెలలు వైన్‌షాపులకు గడువున్నా.. ముందుగానే టెండర్లు పిలిచి సమయం కేటాయించారని, కానీ.. పేదలు కోరుకునే గృహలక్ష్మి పథకానికి మాత్రం 3 రోజులే సమయం ఇచ్చారన్నారు. వైఎస్సార్ హయంలో ఇల్లులేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని, 8 లక్షల ఎకరాలకు పైగా.. పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్, కాంగ్రెస్‌పార్టీ మానుకోట పార్లమెంట్ వ్యవహారాల ఇన్‌చార్జ్ ఎడవెల్లి కృష్ణ, రాష్ట్ర ఆదివాసీ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, నేతలు వెన్నం లక్ష్మారెడ్డి, నూనావత్ రాధ, రామచంద్రునాయక్, నెహ్రూనాయక్, ఎదల్ల యాదవరెడ్డి, తోట వెంకన్న, బోడ రవినాయక్, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, అల్లం నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, నూనావత్ రమేశ్, ప్రభాకర్‌గౌడ్, సతీశ్, గునిగంటి కమలాకర్, నీరుటి లక్ష్మీనారాయణ, భూక్య శ్రీనివాస్, కత్తిస్వామి, ఎండీ హారుణ్, అంబాల శివకుమార్, నర్సింగ శ్రీనివాస్, పద్మం ప్రవీణ్, తూళ్ల ప్రణయ్, బండి శ్రీను, ముత్తినేని సోమేశ్వర్‌రావు, వీరన్నయాదవ్ ఉన్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి



వీరరావు మృతదేహం

పరకాల/రేగొండ: ఆర్టీసీ బస్సు అతివేగం.. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం పోయింది. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రైతు భలేరావు వీరరావును భూపాలపల్లి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా వీరారావు మృతి చెందాడు. వీరారావు పురుగుల మందు కొనేందుకు బైక్‌పై పరకాలకు వెళ్లాడు. ఈక్రమంలో అంబేడ్కర్ సెంటర్ సమీపంలోని యూనియన్ బ్యాంక్ వద్ద వెనుక నుంచి భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన (టీఎస్ 25జెడ్ 0028) నంబర్ గల సూపర్ లగ్జరీ బస్సు అతడిని ఢీకొట్టింది. స్థానికుల సహకారంతో పోలీసులు అతడిని పరకాల సివిల్ ఆస్పత్రికి తరలిస్తుండగా.. కిడ్నీ నుంచి తీవ్రరక్త స్రావమై మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బస్సును స్వాధీనంలోకి తీసుకొని కొంపెల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ రామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పరకాల సీఐ వెంకటరత్నం తెలిపారు.

అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన

వీరరావు మృతి సమాచారం తెలియగానే నారాయణపూర్ గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో చేరుకొని పరకాల అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. పరకాల సీఐ వెంకటరత్నం, ఎస్ఐ శివకృష్ణ ఆందోళనను విరమింపజేశారు.

పిచ్చి కుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు



దేవరుప్పుల: మండల కేంద్రంలోని కొత్తవాడకు చెందిన తోటకూరి వెంకన్న–రేణుక దంపతుల కుమారుడు జీవన్‌పై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. బాలుడి ఎడమ చేతికి తీవ్ర గాయమై రక్తస్రావం అవుతుండడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో స్థానిక ఆర్ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు బాలుడి తాత మహంకాళి తెలిపారు.

విద్య, వైజ్ఞానిక తరగతులను విజయవంతం చేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్: పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో ఈనెల 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు, విజయవంతం చేయాలని ఆ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆలువాల నరేశ్ కోరారు. శుక్రవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు నరేశ్, ప్రవీణ్, వాసు, నిరంజన్, రాహుల్, నగేశ్, వినయ్, చరణ్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.